# అంటుమామిడి

తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రిగారు

౧

మాయ నవ్వుతూఉంటుంది. నే నేదిఅడిగినా ఇదే జబాబు. ఆమె నాదగ్గరనుంచి వెళ్లిపోతుంటే ఆమె నవ్వులో నాభావముకోసము పరీక్షించేవాణ్ణి. తిరుగుతూఉండే బిచ్చగాడుకూడా-రాత్రివలె ఉన్న పగటివేళ-ఈవిధముగా తనమార్గము వెతుకుతాడా?

జీర్ణకుటీరములో నానివాసము. ఎదురుగానే ఆమెతాలూకు విశాలసౌధముఉన్నది. వాళ్ళమేడపై అంతస్తువరాండాలో చిక్కుతట్టి వేసిఉన్నది. మాయ అప్పుడప్పుడు ఒకటి అర పుల్లవిరుస్తూఉండేదనుకొంటాను. ఒకమూల చిక్కుతట్టి తెరిపిఅయింది. ఆసందులోనుంచి ఒకరోజామెను నిరభ్యంతరముగాచూచాను. మరోనా డామె అక్కడికి వచ్చింది. నేను మళ్ళీచూచాను. ఆమెను గుర్తుపట్టాను; ఆమె నన్ను గుర్తుపట్టింది. అక్కడినుంచీ ఆమె ప్రతిరోజూ కొంతసేపు అక్కడికివచ్చేది. నేను చాలాసేపు కనిపెట్టుకొని ఉండేవాణ్ణి. ప్రతీక్ష ఎన్నడూ నిష్ఫలముకాలేదు.

ఎన్నిసార్లు నేనామెదివ్యరూపముసందర్శిస్తానో అన్నిసార్లు కాస్తోకూస్తో వైచిత్ర్యము కనబడేది. సమ్మోహకరమైన ఆమెహాసము నాకు పేరువలెనే బాగాజ్ఞాపకమున్నది. కాని ఆమె కంఠస్వరము ఎంతకోమలము ఎంతకరుణమునో నాకు జ్ఞాపకములేదు - కాదు కాదు- తెలియదు.

ఆమె కంఠధ్వని వినడానికి చాలా కుతూహలముతో ఉండేవాణ్ణి. కాని ఆపాషాణ-కాదు-స్వర్ణప్రతిమ ఎన్నడూ పలకనేలేదు. నేను చాలాచాలా ఉపాయాలు పన్నినమీదట ఆమె పెదవులమీద చిరునవ్వు అంకురించేది. మాటమాత్రము వచ్చేదికాదు. విగ్రహము కనబడేది. సంగీతము వినబడేదికాదు. భావము తెలిసింది, భావార్థము బోధపడలేదు. నానేత్రాలు ధన్యమయినవి, కర్ణాలకు తృప్తికలగలేదు. అప్పుడప్పుడు నా కర్ణద్వయము "నీవు చెవిటివాడవు కావుగదా!" అని గుసగుసలాడేది.

౨

జీవితములో అన్నింటికంటె ప్రియమైనవస్తువూ, మనోహరమైన సంఘటనా బాగా జ్ఞాపకముంటవని లోకులంటారు. కాని భయంకరమైన ఆసంధ్యాకాలము ఈక్షణమువలె జ్ఞాపకమున్నది.

వేసవి సాయంకాలము. తాపతప్తమైన భూమిమీద నీళ్ళుచల్లి నేను వంటచేసుకొంటున్నాను. ఆకస్మికముగా చంద్రోదయమయింది! చిక్కుతట్టిదగ్గర మాయకనబడ్డది. ఆమె మామిడిపండురసము పీలుస్తున్నది. మామిడిపండు మధురము; అంతకంటె వెయ్యిరెట్లు

మధురము ఆమె చిరునవ్వులు! పెదవులమీద ఇంత మాధుర్యమున్నప్పటికీ తాను మామిడి పండు తినడమెందుకో!

మాయ పండుతిని పైతొక్కలు దూరముగా పారవేసింది. తన ఎంగిలి మామిడి తొక్క ఒకటైనా నావంటలోపడితే వంట పాడయిపోతుందని ఆమె భావము; పవిత్రమవుతుందని నాభావము.

మాయ టెంక చీకబోతూఉంటే హఠాత్తుగా జారింది. నావంటసామగ్రిలో అది పడుతుందేమోఅని మాయకు చప్పున స్ఫురించింది. దాన్ని ఆపడానికి ఆమె ముందుకు సాగింది. టెంకతోపాటు మాయకూడా మేడమీదినుంచి కింద పడిపోయింది. విశ్వప్రేమ త్వరవల్ల ఆమెపడిపోయింది. లోకమా! నీకు మాయ పనికిరాకపోయిందా? ఆమొగ్గ ఇంకా వికసించనైనాలేదే మూఢలోకమా!

టెంక, మాయ - ఇద్దరూ నాయెదట కఠినస్థలముమీద పడ్డారు. నామీద పిడుగు పడ్డది. ఆమె మూర్ఛపోయింది.

చిటికలోనే ఆమె తల్లిదండ్రులక్కడికి పరుగెత్తుకువచ్చారు. విసిరినమీదట మాయ కళ్ళుతెరిచింది. అందరిప్రాణాలూ కుదటపడ్డవి. మాయ పెదవి కదిపింది. నాకు ప్రాణము లేచివచ్చింది. పెదవులు వణుకుతూఉండగా మాయ "ఎంగిలిటెంక కాదు" అన్నది. అటు తర్వాత ఆమెనోట మాటరాలేదు. కళ్ళు మూతలుపడ్డవి. మాయ ఇంకేమీ మాటాడలేదు. ఆమె కడసారిమాటలు అవే. మాయ శాశ్వతముగా అంతరించింది.

అన్నివైపులనుంచీ "ఎంగిలి టెంకకాదు" అని ప్రతిధ్వని వస్తున్నది. ప్రతి జడపదార్థమూ "ఎంగిలిటెంక కాదు" అని అంటున్నది. ప్రపంచమంతా "ఎంగిలి టెంక కాదు" అంటున్నది.

మాయ మళ్ళీ ఎక్కడాకనబడలేదు. చాలాకాలమువరకూ ఆమె అన్వేషణములో ఇటూఅటూ వెర్రివాడిలాగ తిరుగుతూఉండేవాణ్ణి. ఆమెజాడ ఎక్కడాదొరకలేదు.

ఆకర్షణపదార్థమేమీ లేకపోవడముచేత లోకాన్ని త్యజించి నిర్జనవనములో ఉంటున్నాను. మాయతాలూకు టెంకమాత్రము నాకు తోడైఉన్నది. మాయ లభించడము కోసము ప్రయత్నించాను. కాని ఆమె లభించలేదు. శాంతికోసము యత్నిస్తే అదీ లభించలేదు.

## 3

ఒకనాడు నల్లమబ్బు వర్షిస్తున్నది. నేను టెంక భూమిలో నాటినాను. కొద్దిరోజుల కది మొలకెత్తింది. దాన్ని నిరంతరముగాకాపాడినాను. కొన్నాళ్ళ కది విశాలవృక్షమైంది. హఠాత్తుగా ఒక వసంతఋతువులో పూచింది. చిరునవ్వుతో మాయ ప్రత్యక్షమయిందని పించింది. కోకిల దానిమీద విశ్రాంతితీసుకొని కూకూ అనడము మొదలుపెట్టింది. అది

మాయ కంఠధ్వనే అనిపించింది. ప్రతిపువ్వులోనుంచీ పిందె బయలుదేరింది. "ఎంగిలి మామిడికాదు" అని మాయ అన్నట్టుతోచింది.

ఆచెట్టుక్రిందనే నాకుటీరము. ఆచెట్టుమీదనే పిట్టలు గూళ్ళుకట్టుకొని సుఖముగా ఉండనిచ్చాను. ఎండపడి వెళ్ళుతున్న ప్రతిబాటసారినీ చెట్టునీడలో విశ్రాంతితీసుకోమని బలవంతపెట్టేవాణ్ణి.

ప్రతిసంవత్సరమూ మామిడిపళ్ళకాలములో ప్రతిబాటసారికీ ఒక్కొక్కపండు ఇచ్చేవాణ్ణి. వాళ్ళు తినేటప్పుడు ఎంగిలిమామిడి కాదనుకొనేవాణ్ణి. ఏడాదికొకసారి మామిడి పూలగుత్తుల చాటునుంచి మాయ తొంగిచూచి ప్రత్యక్షమయ్యేది. ఆమెను మాయాఅని పిలిచేవాణ్ణి. ఆమె సిగ్గుపడి ఆకుబురఖా బాగా సవరించుకొనేది.

"ఎందుకు మాయా! ఇంతసిగ్గు?" అనేవాణ్ణి. "ఇప్పుడు నాకు వివాహమయింది" అనేది మాయ.

—శ్రీగోవిందవల్లభపంతుగారి హిందీవ్యాసమున కనువాదము.

## యెడారిలో

శ్రీమతి గొల్లపూడి జయలక్ష్మమ్మగారు

ఏమి? ఏకాకివై యిట్టి తిమిరవీథి
దీనగళమెత్తి యస్ఫుటధ్వనులనిట్టు
ప్రణయభిక్షనుగోరెడు దీనురాలి
వెవరు?
ఏల యీయేకాంతజీవితమ్ము
జీర్ణవస్త్రాలశుష్కించి యొరులులేని
వింతసీమను వసియింతువేలనీవు?
వేడికన్నీటిబిందువు లడ్డులేక
యెన్నినాళ్లయెనో యిట్టులీయెడారి
సీమనింకుచు? నీదుపదమ్ము లీయె
డారియిసుకలోతిరుగగా నేర్చుటెట్లొ?

ఇంతకాలమ్ముయిట్టు లీవింతసీమ
మూగనేత్రాల నేరికై యేగుచుంటి?
విప్పుడైనను లేక మరెప్పుడైన
నీదుజీవన మీయెడ శాంతిగొనున?
ఏరిరూపమ్ముదాచితో యిన్నినాళ్లు
హృదయపేటిక? అతనికై నీదుప్రణయ
గానమీవిశాలయెడారి(?) లీనమగుచు
యెన్నినాళ్లయెనో?
భ్రమయేలనీకు?
ఏలయీదీర్ఘపయనమ్ము (?) యిట్టులీయె
డారియిసుకలో తిరుగగా నేరికొరకు?

## మనవి

వడ్లమాని అప్పారావుగారు

ఒకచిరుగీతిలోపఱు రహోదయనూత్నసుధార్ద్రభావనా
ప్రకటనచాలు నాయెడదపాడును కల్పములుండుదాక, మీ
సికతములందు రిత్తగకృశించు నవాభ్రపుతేనెజల్లు మ్రో
గక కనుమూయునా బ్రతుకు కంఠమునంటిన పాడకుండునా!